సాక్షి 24|7
తూర్పుగోదావరి
శుక్రవారం
6-4-2018

## ఘనంగా ఐఎస్‌టీ వార్షికోత్సవం



విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమం

బాలాజీచెరువు: జేఎన్‌టీయూకేలో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ టెక్నాలజీ(ఐఎస్‌టీ) వార్షికోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రెక్టార్ పూర్ణానందం మాట్లాడుతూ ఐఎస్‌టీ విభాగాన్ని ప్రథమ ఉపకులపతి అల్లం అప్పారావు ప్రారంభించగా మూడవ ఉపకులపతి వీఎస్ఎస్ కుమార్ సారథ్యంలో నిధులను సమకూర్చి ఎక్కువ మంది చేరేలా కృషి చేశారన్నారు. స్కూల్ ఆఫ్ బయోటెక్నాలజీ విభాగం పరిశోధనల ద్వారా పేటెంట్ హక్కులు సాధించి వర్సిటీని కీర్తి శిఖరాలకు చేర్చారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. రిజిస్ట్రార్ సుబ్బారావు, డీఈ సుబ్బారావు, అధ్యాపకులు పాల్గొన్నారు.




ఎన్‌టీయూకేలో జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకలు

బాలాజీచెరువు: దళితుల అభ్యున్నతికి విశేషంగా పాటుపడిన జగ్జీవన్‌రామ్ సేవలు చిరస్మరణీయమని జేఎన్‌టీయూకే రెక్టార్ పూర్ణానందం పేర్కొన్నారు. జేఎన్‌టీయూకే ప్రాంగణ కాన్ఫరెన్స్ హాలులో గురువారం బాబూ జగ్జీవన్‌రామ్ 111వ జయంతి ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వక్తగా, రాజకీయ నాయకుడిగా, సంఘ సేవకుడిగా, రక్షణ, వ్యవసాయ శాఖ మంత్రిగా పలు పదవులను అధిష్ఠించి వాటికి వన్నె తెచ్చారన్నారు. ఆయన జన్మదినోత్సవం 'సమత దినోత్సవం'గా నిర్వహిస్తున్నారన్నారు. జేఎన్‌టీయూకేలో ఎస్సీ,ఎస్టీలకు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నామన్నారు. చీఫ్ ఇంజినీర్ ప్రొఫెసర్ రవీంద్ర, అడ్మిషన్స్ డైరెక్టర్ రామలింగరాజు, డాక్టర్ స్వర్ణకుమారి, టిక్స్ డైరెక్టర్ ఏసురత్నం, ఈసీఈ విభాగాధిపతి పద్మప్రియ పాల్గొన్నారు.